క్లుప్తంగా

తైక్వాండోలో జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల తిరుపతిలో జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన షేక్ ఫరహతుల్లాను మంగళవారం నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొని రావాలని ఎస్పీ అభినందించారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్నట్లు షేక్ ఫరహతుల్లా తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంజీవనగర్ సెంటర్ ట్రేడ్ యూనియన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సులు అని ప్రచారం చేసి గెలిచిందన్నారు. అయితే, ఆటోలపై ఆధారపడిన కార్మికులకు ఇప్పటి వరకు ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. ఉన్నత చదువులు చదివి ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు ఫ్రీ బస్సుల వల్ల జీవనోపాధి కోల్పోతారన్నారు. కూటమి ప్రభుత్వం వారికి నెలకు రూ.20వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సోమన్న, శ్రీనివాసులు, సామేలు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు పెంచుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు పెంచుకోవాలని శ్రీసంకల్ప్ ఒలింపియాడ్ శాంతినికేతన్ పాఠశాల చైర్మన్ సుధాకర్ అన్నారు. పట్టణంలోని ఆ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మెనూ పాటించకపోతే చర్యలు


పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారి

నంద్యాల(అర్బన్): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వడ్డించకపోతే చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తాక్ అహమ్మద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థులకు వడ్డించిన ఆహారాన్ని ఆయన పరిశీలించారు. నాణ్యతతో కూడిన ఆహారం విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాదంలో 85 గొర్రెలు సజీవ దహనం

ఆళ్లగడ్డ: పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 85 గొర్రెలు సజీవ దహనమయ్యాయి. పెద్ద కందుకూరు రోడ్డులోని బృందావన్ కాలనీ సమపంలో మిట్టపల్లి కృష్ణయ్య అనే గొర్రెల యజమాని పూరిపాక నిర్మించుకుని అందులో తన గొర్రెలను పోసించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం పొద్దు పోయిన తరువాత ప్రమాదవశాత్తు పూరిపాకకు నిప్పు అంటుకుంది. గుర్తించకపోవడంతో మంటలు వ్యాపించి అందులో ఉన్న 85 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

గూగుల్ ఆర్గనైజర్‌గా ఎస్‌వీఆర్ విద్యార్థి ఎంపిక


ఎంపికైన భువన

నంద్యాల(అర్బన్): గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్‌క్యాంపస్ ఆర్గనైజర్‌గా స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థిని భువన ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆవిద్యార్థినిని కళాశాల ఎండీ దినేష్‌రెడ్డి, అధ్యాపకులు మంగళవారం అభినందించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు తెలిపారు.

196 మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 196 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరుద్యోగ యువకులు మొత్తం 586 మంది హాజరైనట్లు ఆ సంస్థ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. అంతకు ముందు జాబ్ మేళా కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి సోమశివారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ రాణి మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శాంతించిన కుందూ

● తగ్గిన వరద ఉద్ధృతి ● ఊపిరి పీల్చుకున్న నదీతీర గ్రామాల ప్రజలు

ఉయ్యాలవాడ : కుందూనదిలో వరద నీటి ఉద్ధృతి మంగళవారం కొద్దిగా తగ్గింది. దీంతో నది తీర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద నీటితో పలు గ్రామాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఉయ్యాలవాడ మండల పరిధిలో నది తీరం వెంట ఉన్న 14 గ్రామాల్లో నీట మునిగిన విద్యుత్ మోటార్లు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. సుద్దమల్ల, ఉయ్యాలవాడ, నర్సిపల్లె, కాకరవాడ, రూపనగుడి, ఒంటెద్దుపల్లె లోతట్టు ప్రాంతాల్లో మాత్రం వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు వరినాట్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం కుందూలో 20 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నదికి విడుదల చేసే నీటిని 12 వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు అధికారులు తెలిపారు. అలాగే పంట పొలాల్లో నిలిచిన వరద నీరు కూడా తగ్గుముఖం పట్టింది. కాగా మూడురోజులు వరద నీటిలో మునిగిన వరి, మొక్కజొన్న, పత్తి, తదితర పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి వాటికి ఆశించే తెగుళ్ల నివారణ చర్యలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ప్రవాహం పెరిగితే నష్టమే

దొర్నిపాడు: కుందు పరివాహక ప్రాంతాలు అయినా నంద్యాల, బండిఆత్మకూరు, కోవెలకుంట్ల, దొర్నిపాడు, గోస్పాడు, ఉయ్యాలవాడ, చాగలమర్రి మండలాల్లోని 41గ్రామాల్లో ఏటా 6,000 హెక్టార్లకు పైగా వరిని సాగు చేస్తారు. ఇప్పటికే సాగు పనులు ఊపందుకున్నాయి. దొర్నిపాడు మండలంలోని క్రిష్టిపాడులో 226, గుడుపాపలలో 80 హెక్టార్లలో వరి సాగు చేశారు. కందూకు భారీగా వరద నీరు రావడంతో అక్కడక్కడా వరిపంట నీటమునిగింది. మళ్లీ నదిలో నీటి ఉద్ధృతి పెరిగితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


బోడెమ్మనూరు గ్రామ సమీపంలో కుందూనదిలో బయటపడిన విద్యుత్ పంపుసెట్లు


ఇంజేడు గ్రామ సమీపంలో మిరపలో తగ్గుముఖం పట్టిన వరద నీరు

నేలకొరిగిన మొక్క జొన్న

రుద్రవరం: గత నాలుగు రోజుల నుంచి మండలంలో విడతలు, విడతలుగా వర్షం కురుస్తోంది. ఈ వానకు గాలి తోడు కావడంతో పంటలు నేలకొరుగుతున్నాయి. ప్రధానంగా కంకి దశలో ఉన్న మొక్క జొన్న పంట గాలి వానకు నేల పరుపుగా మారుతోంది. దీంతో రైతులు తీవ్రం ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటే గాలి వాన ముంచేస్తోందని వాపోతున్నారు. మండలంలోని ఎల్లావత్తుల, డి.కొట్టాల, అప్పనపల్లె, వెలగలపల్లె, కొండమాయపల్లె, ముకుందాపురం, ఆలమూరు, నర్సాపురం తదితర గ్రామాల పరిధిలో మొక్క జొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.


దెబ్బతిన్న మొక్కజొన్న పంట

పరమత సహనం పాటించాలి

చాగలమర్రి: పండుగ సమయాల్లో ప్రతి ఒక్కరు పరమత సహనం పాటించి సోదరభావంతో మెలగాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు సూచించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మంగళవారం చాగలమర్రి పోలీసు స్టేషన్ ఆవరణలో ఇన్‌చార్జ్ ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన వినాయక చవితి వేడుక ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే మండలపాల వద్ద ముగ్గురు వలంటీర్లు కాపలాగా ఉండాలన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలన్నారు. నిమజ్జన కార్యక్రమం రోజున డీజేలకు అనుమతి లేదని, అలాగే ఆ రోజు ఎవరూ మద్యం సేవించరాదన్నారు. నమాజు సమయంలో మసీదుల వద్ద ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.


పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కంబగిరి రాముడు

రెండేళ్ల క్రితం గణేష్ నిమజ్జనం సందర్భంగా చిన్నవంగలి గ్రామంలో ఘర్షణ జరిగిందని, ఈ సారి ప్రశాంతంగా జరుపుకోవాలని ఆ గ్రామస్తులను సీఐ సూచించారు. పీస్ కమిటీ సమావేశంలో ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనుస్‌బాషా, మత పెద్దలు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, అన్ని గ్రామాలకు చెందిన గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

గోస్పాడు: వర్షా కాలంలో ప్రబలే వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి, ఆశా వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో మురికినీరు నిల్వలు ఉండి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. వాటి కాటు వల్ల జ్వరాలు వస్తాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. అతిసారం ప్రబలకుండా కాచి వడబోసిన నీరు తాగాలన్నారు. అనంతరం పొగాకు వినియోగంతో కలిగే కలిగే నష్టాలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 6వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆందోళనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. రేషన్ దుకాణాల్లో అరకొరగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా పంపిణీ వ్యవస్థలో 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాల్సి ఉండగా కేవలం బియ్యంతోనే సరిపెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, హరినాథ్, సుశీలమ్మ, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన

నంద్యాల(న్యూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తోటమద్దులు, శివమ్మ, లలితమ్మ మాట్లాడుతూ ఒప్పందాల జీవోలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నంద్యాల మండలం చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, అధ్యక్షుడు ఏసురత్నం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మహిళలు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

అవీ-ఇవీ

ఎస్‌ఎఫ్ఐ ప్లీనరీని జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 4, 5వ తేదీల్లో సీపీఎం కార్యాలయంలో నిర్వహించే ఎస్‌ఎఫ్ఐ ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ ఎంఆర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు హాజరవుతారన్నారు. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారన్నారు.

నేడు గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమావేశం

నంద్యాల(అర్బన్): గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఓ మల్లికార్జున్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో గణేష్ నిమజ్జనం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించేందుకు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఓ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

108 వాహనం బోల్తా

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె గ్రామ సమీపంలో 108 వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘనటలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. రుద్రవరం పీహెచ్‌సి వైద్య సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. పీహెచ్‌సీ పరిధిలోని 108 వాహనంలో ఓ పేషంట్‌ను చికిత్స నిమిత్తం రుద్రవరం నుంచి ఎర్రగుడిదిన్నె మీదుగా నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తీసుకెళ్తున్నారు. అయితే, వర్షానికి దారి బురద మయంగా ఉండటంతో వాహనం ఎర్రగుడిదిన్నె సమీపంలోకి చేరుకోగానే అదుపు తప్పి పక్కనే ఉన్న వంకలో బోల్తా పడింది. ఆ ప్రమాదంలో సిబ్బంది శ్రీనివాసులుకు స్వల్ప గాయం కాగా, మిగిలిన వారు సురక్షితంగా బయట పడినట్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపారు.

వీబీఆర్‌లో 14.440 టీఎంసీల నీరు

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు బానక్కచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా 1,500 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. వీబీఆర్ పూర్తిస్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా మంగళవారం 14.440 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే వీబీఆర్ నుంచి మద్రాసు కాలువకు 5000, ఎస్ ఆర్ తూముకు 10 క్యూసెక్కులు, నంద్యాల తాగు నీటి అవసరాలకు 10 క్యూసెక్కులు నీటి విడుదల చేయడం జరుగుతుందని తెలుగు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు.

ఆధ్యాత్మికం

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవా చేశారు. అనంతరం వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో..

పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామికి మంగళవారం భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాతసేవ నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రుద్రవరంలో హిందూ ధర్మ ప్రచారం

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రవచన కర్త శ్రీనివాస రామానుజ దాసు ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహ స్ర నామస్తోత్ర పారాయణం గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నిత్య తృప్తదాస్, నరసింహయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, వెంకట నర్సయ్య, హరేకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాట రాయుళ్ల అరెస్టు

శిరివెళ్ల: నంద్యాలకు చెందిన 14 మంది శిరివెళ్ల–రుద్రవరం రస్తాలోని 2వ వాగు వద్ద ఉన్న మామిడి తోటలో పేకాటాడుతున్నారు. ఈమేరకు సమాచారం అందడంతో శిరివెళ్ల పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో 8 మంది పరారయ్యారు. నంద్యాలకు చెందిన రవికుమార్, సలాం, శ్రీనివాసులు, మద్దయ్య, సుభహాన్, చంద్ర పట్టుబడిన వారిలో ఉన్నారు. వీరి నుంచి రూ. 41,220 నగదు, 4 సెల్‌ఫోన్లు, 1 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

మోటార్ల దొంగలు అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులో నీటి మోటార్లను దొంగలించే ఇద్దరిని తాలూకా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నజీర్ హుస్సేన్ తెలిపిన వివరాల మేరకు.. నందమూరినగర్ ప్రాంతానికి చెందిన నాగరాజు, షాంషావలి స్నేహితులు. ఇద్దరూ కలిసి రాత్రి సమయాల్లో ఇళ్ల బయట ఏర్పాటు చేసుకున్న నీటి మోటార్లను దొంగలించే వారు. దీనిపై ఫిర్యాదు అందడంతో దర్యాప్తు చేపట్టిన తాలూక పోలీసులు మంగళవారం ఆటోనగర్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. దీంతో వారి వద్ద ఉన్న రెండు మోటార్లతో పాటు చోరీకి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐతెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

ఆళ్లగడ్డ: ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సమష్టిగా విజయవంతం చేద్దామని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి మురళీ కృష్ణ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం ఆదనపు జిల్లా జడ్జి సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాల వంటి వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని ఇరువర్గాలకు చెందిన న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వరా వెంకటప్రసాద్, ఏపీపీ సోమశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.


మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

అక్రమ లేఅవుట్లపై చర్యలు

చాగలమర్రి: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లపై చర్యలు తప్పవని డీఎల్‌పీఓ రాంబాబు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు మంగళవారం చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో కుడా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు వెంచర్లను గుర్తించి వాటిలోని ప్లాట్ల హద్దు రాళ్లను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రతి వెంచర్‌లో కమ్యూనిటీ అవసరాలకు 10 శాతం, రోడ్లకు 5 శాతం ఖాళీ స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. చాగలమర్రిలో సుమారు 41 అక్రమ లే అవుట్లను గుర్తించామని, ఈ లే అవుట్లకు సంబంధించి సుమారు 100 సర్వే నెంబర్లకు చెందిన భూయాజమానులు ఉన్నారన్నారు. నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని నిర్వాహకులకు పలుమార్లు నోటీసులు అందజేసినా స్పందన లేదన్నారు. దీంతో చాగలమర్రి టోల్‌ప్లాజా, కలుగొట్లపల్లె గ్రామానికి వెళ్లే రాస్తా, శెట్టివీడు గ్రామ సమీపంలోని అక్రమ లే అవుట్లలో ఏర్పాటు చేసిన ప్లాటు హద్దు గుర్తింపు రాళ్లను జేసీబీతో తొలగించి, రోడ్లులను తవ్వడం జరిగిందని వెల్లడించారు. అనుమతులు లేకుండా వేసిన వెంచర్లలో ఎవరైనా ప్లాట్లను కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ, ఇన్‌చార్జ్ ఈఓ తాహీర్‌హుసేన్, చాగమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ హరిప్రసాద్, వీఆర్‌ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


శెట్టివీడు రస్తాలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో ప్లాట్ల హద్దు రాళ్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

రైతు బాంధవుడు వైఎస్సార్

బొమ్మలసత్రం: రైతుల కోసం అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన వైఎస్సార్ రైతు బాంధవుడు అని నంద్యాల మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి మాజీ ఎంపీ పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, నాయకులు పోచా జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పోచా

●వాన కురిస్తే ఇంతే..



శిరివెళ్ల: కర్నూలు– కడప జాతీయ రహదారి 4 లైన్ విస్తరణలో భాగంగా మండలంలోని గోవిందపల్లె, శిరివెళ్ల, యర్రగుంట్ల మెట్టల వద్ద అండర్ పాస్‌వేలు నిర్మించారు. అయితే, చిన్నపాటి వర్షం కురిసినా వాటి కిందకు వర్షపు నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. వర్షం నీరు పోవటానికి సరైన మార్గాలు ఏర్పాటు చేయకపోవడం దీనికి కారణమని స్థానికులు చెబుతున్నారు. మహిళలు, వృద్ధులు అండర్ పాస్‌వే కింద వెళ్లాలంటే ఎక్కడ జారి కిందపడతామోనని భయపడుతున్నారు. శిరివెళ్ల మెట్ట వద్దయితే జాతీయ రహదారిపైకి ఎక్కి అవతలకు దాటుతున్నారు. హైవేపై 100 కిలో మీటర్ల వేగంగా వాహనాలు వస్తుంటాయి. ఏ మాత్రం వాటిని గమనించకపోతే ప్రమాదానికి గురి కావాల్సి వస్తుంది. అధికారులు స్పందించి అండర్ పాస్‌వేల కింద వర్షం నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

●రైతన్నల అవస్థలు


తూముకు అడ్డంగా రాళ్లు వేస్తున్న రైతులు

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపై ఏర్పాటు చేసిన తూముల షెట్టర్లు పని చేయడంలేదు.దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.19వ బ్లాక్ కాల్వకు సంబంధించిన తూము షెట్టర్ కిందకు దిగడం లేదు. దీంతో కాల్వలో నీటి ప్రవాహం అధికమైంది. ఇప్పటికే మండలంలోని మందలూరు వద్ద 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు గండి పడింది.ఆ గండి నుంచి నీరు పంట పొలాల్లోకి పారుతోంది.దీంతో ఆ గ్రామానికి చెందిన రైతులు తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపైకి వెళ్లి 19వ బ్లాక్ తూము షెట్టర్‌ను కిందకు దించి నీటి ప్రవాహన్ని తగ్గించాలని యత్నించారు. అయితే షెట్టర్ కిందకు దిగక పోవడంతో రైతులు తూముకు అడ్డంగా పోట్లను అమర్చి గడ్డి,సూపర్ పట్ట,రాళ్లను అడ్డుగా వేసి నీటి విడుదలను తగ్గించుకున్నారు.

పకడ్బందీగా మధ్యాహ్న బడి భోజనం అమలు

● వంటశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి
● అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్నం పూట పాఠశాల, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథక అమలుపై సమావేశం జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖాధికారి చింతామణి, డీఈఓ సుధాకర్‌రెడ్డి, పీడీయాట్రిషన్, న్యూట్రిషన్ డాక్టర్లు, మండల విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సెక్రటరీలు, వంట ఏజెన్సీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీ మొక్కుబడిగా కాకుండా నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. ఇక్కడి ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూలో మార్పులు చేర్పులకు అందరి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు వడ్డించే అన్నం మెత్తగా, గట్టిగా ఉండరాదన్నారు. కోడిగుడ్డు, రాగి జావా లేదా ముద్ద, స్వీట్ పొంగల్ తదితర పోషక పదార్థాలను పిల్లలు ఏ విధంగా ఇష్టపడతారో ఆ రీతిలో తయారీ చేసి ఇవ్వాలన్నారు. ప్రతి ఆహార పదార్థం వేడివేడిగా చేసి వడ్డించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ గొప్పతనం వివరిస్తూ నాణ్యమైన భోజనంతో పాటు వంటశాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఇవే విద్యార్థులను మధ్యాహ్నం బడి భోజనం తినేలా చేస్తాయన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు చేతుల శుభ్రత, మరుగుదొడ్లను ఉపయోగించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో న్యూట్రిషన్ గార్డెన్ పెంపొందించడంలో సహాయ సహకారాలు అందించాలన్నారు. తాను ప్రతి రోజు ఒక పాఠశాలను సందర్శించి ఎండీఎంను స్వయంగా పరిశీలిస్తానన్నారు.